



మృతులు వీరే...

గుళ్లాపుర వద్ద జరిగిన ప్రమాద బాధితులు హావేరి జిల్లా సవనూరు పట్టణంలోని ఒకే ప్రాంతంలో నివసించేవారు. ప్రమాదంలో ఫయాజ్ ఇమాంసాబ్ జమఖండి(45), వసీమ్ విరుల్లా ముడగేరి(35), ఇజాజ్ ముస్తాక్ ముళ్ళ(20), సాదిక్ బాషా(30), గులాం హుసేన్ జవళి(40), ఇంతియాజ్ మంజఫర్ ముళకే (36), అల్ఫాజ్ జాఫర్ మండక్కి(25), జిలాని అబ్దుల్ జఖాతి(25), అస్లాం బాబులి బెన్నె(24), జలాల్ తార(30) మృతిచెందారు. కుమట పట్టణంలో బుధవారం సంత ఉండటంతో సరుకును లారీలో వేసుకుని అందరూ కలిసి మంగళవారం అర్ధరాత్రి బయలుదేరారు. తెల్లవారు జామున ప్రమాదానికి గురయ్యారు. గాయపడినవారికి హుబ్బళ్ళిలోని కిమ్స్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పొగమంచు ఉండటం, ఎదురుగా వస్తున్న వాహనానికి తప్పించే ప్రయత్నంలో ప్రమాదం జరిగిందని ఉత్తర కన్నడ జిల్లా ఎస్పీ నారాయణ్ యల్లాపుర తెలిపారు.



మరణ మృదంగం

- ఘోర ప్రమాదాలకు 14 మంది బలి
- ఉత్తర కన్నడ జిల్లాలో లారీ బోల్తా
- 10 మంది చిరువ్యాపారుల దుర్మరణం
- సింధనూరు వద్ద క్రూసర్ బోల్తా
- ముగ్గురు వేద విద్యార్థులు, డ్రైవర్ మృతి


సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు, స్థానికులు

బెంగళూరు/బళ్లారి/రాయచూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెండు ప్రాంతాలలో జరిగిన ఘోర ప్రమాదాలలో ఒకే రోజు 14 మంది మృత్యువాత పడ్డారు, 28 మంది గాయపడ్డారు. ఉత్తర కన్నడ జిల్లా యల్లాపుర తాలూకా గుళ్యాపుర వద్ద బుధవారం తెల్లవారుజామున లారీ బోల్తాపడి పది మంది మృతిచెందారు. మరో 18 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. వీరందరూ సంతలలో కూరగాయలు, పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులు. దట్టమైన పొగమంచు కారణంగా, ఎదురుగా వస్తున్న మరో వాహనానికి దారి వదిలే క్రమంలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, పక్కనే ఉన్న గంతలోకి లారీ బోల్తా పడింది. దీంతో లారీలో పళ్లు, కూరగాయల సంచుల పైభాగాన కూర్చున్నవారు సరుకుల కింద ఇరుక్కుపోయి, ఊపిరాడక విలవిలలాడారు. అక్కడికక్కడే 9 మంది మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. ప్రమాదం తెల్లవారుజామున జరగడం, పొగ మంచు దట్టంగా ఉండటంతో సుమారు గంటపాటు ఎవరూ గుర్తించలేకపోయారు. ఈ కారణంగా మృతుల సంఖ్య పెరిగిందని పోలీసులు తెలిపారు.

సవనూరులో విషాదం

సంతలు జరిగే ప్రాంతానికి సకాలంలో చేరుకునేందుకు చిరు వ్యాపారుల బృందం అర్ధరాత్రి సమయాలలో బయలుదేరేది. సంత ముగిశాక స్వస్థలాలకు చేరుకునేందుకు అదే సమయం అయ్యేది. ఇంటి నుంచి వెళ్లిన తమవారు ఘోర ప్రమాదానికి గురయ్యారని తెలియగానే సవనూరులో విషాదం నెలకొంది. ప్రమాదం గురించి తెలియగానే బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు ఆ ప్రాంతానికి పరుగులు తీశారు. పోస్టు


చెల్లాచెదురుగా పడిన కూరగాయలు, పండ్లు

మార్టం అనంతరం మృతదేహాలను కాలనీకి వస్తాయని భావించి స్థానికులు ఏర్పాట్లు చేశారు.

ప్రధాని సంతాపం

ఉత్తరకన్నడ జిల్లా, రాయచూరు జిల్లాల్లో జరిగిన ప్రమాదాలపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, సీఎం సిద్దరామయ్య మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై తదితరు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ తలా రూ.2 లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడ్డవారికి రూ.50వేలు పరిహారం ఇస్తామని 'ఎక్స్' ద్వారా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం సిద్దరామయ్య మృతుల కుటుంబాలకు రూ.3 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు.

సింధనూరు వద్ద నలుగురు


గాయపడిన వారిని సింధనూరు ఆసుపత్రిలో పరామర్శిస్తున్న రాయచూరు ఉన్నత పోలీస్ అధికారి


హర్షవర్ధన్(ఫైల్)


సుజయేంద్ర (ఫైల్)


అభిషేక్ (ఫైల్)

రాయచూరు జిల్లా సింధనూరు సమీపంలో మంగళవారం రాత్రి టైరు పేలి క్రూసర్ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏపీలోని కర్నూలు జిల్లా మంత్రాలయం గురురాఘవేంద్ర మఠం సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు సుజయేంద్ర(22), అభిలాష్ (20), హర్షవర్ధన్(18) డ్రైవర్ కంసాలి శివ(20) మృతిచెందారు. కొప్పళ జిల్లా అంజనాద్రి బెట్టలో జరుగుతున్న నరహరితీర్థుల ఉత్తరారాధనల్లో పాల్గొనేందుకు నాలుగు వాహనాలలో సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు మంత్రాలయం నుంచి మంగళవారం బయలుదేరారు. సింధనూరు - రాయచూరు మధ్య వైష్ణవి దేవి ఆలయం క్రాస్ వద్ద వంతెన దాటుతున్న సమయంలో క్రూసర్ టైరు పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. హరి, విజయేంద్ర, భరత్, రాఘవేంద్ర, తనీష్, శ్రీకర్, వాసుదేవ బసవ శర్మ, రాఘవేంద్ర నారాయణపేట, జయసింహ, బసంత తీవ్రంగా గాయపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని సింధనూరు తాలూకా ఆస్పత్రికి తరలించారు. సింధనూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులలో సుజయేంద్ర, కంసాలి శివ మంత్రాలయంవాసులు కాగా, అభిలాష్ కొప్పళ్, హర్షవర్ధన్ బళ్లారివాసులు. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్‌తోపాటు 13 మంది సంస్కృతపీఠం విద్యార్థులు ఉన్నారు.

పశ్చిమ కనుమలకు శరాఘాతం

శరావతి ప్రాజెక్టు విస్తరణ
డీసీఎఫ్‌ల తీరుపై సర్వత్రా విమర్శ



బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గ జిల్లాలో కర్ణాటక విద్యుత్ మండలి (కేపీసీ) 8005 కోట్ల రూపాయలతో శరావతి పంప్ స్టోరేజ్ పథకం అమలు చేస్తే పశ్చిమకనుమలలో నివసించే జీవరాశులకు నష్టం మిగల్చనుందని వన్యప్రాణి అభిమానులు మండిపడుతున్నారు. శరావతి పంప్‌స్టోరేజ్‌కు 134 ఎకరాలు ఉపయోగించాల్సి వస్తుందని శరావతి పరిధిలోని వన్యజీవిధామకు సంబంధించిన ముగ్గురు డిప్యూటీ కన్సర్వేషన్ ఆఫ్ ఫారెస్టుకు సిఫారసు చేశారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే పశ్చిమకనుమల పర్యావరణానికి భంగం కలగనుందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శివమొగ్గ, సాగర్, హొన్నావర అటవీసంరక్షణ అధికారులు ప్రాజెక్టు నిర్మించే స్థలాన్ని పరిశీలించి వారంక్రితం ముఖ్య సంరక్షణాధికారిక నివేదిక సమర్పించారు. అక్కడ అనుమతులు మంజూరు కావడంతో రాష్ట్ర వన్యజీవి మండలిలో చర్చ జరిగింది. గతంలో ముగ్గురు డీసీఎఫ్‌లు ఈ ప్రాజెక్టు నిర్మాణం సమంజసం కాదని తిరస్కరించారు. అయితే ఇటీవలే రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం తెలపడంతో డీసీఎఫ్‌లు తమ నిర్ణయాన్ని మార్చుకుని ప్రాజెక్టుకు అనుకూలంగా సిఫారసు చేశారు. కొత్తగా ప్రాజెక్టు నిర్మించడం లేదని విద్యుత్ మండలి స్పష్టం చేస్తోంది. కానీ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టును విస్తరింపచేసేందుకు ఈ ప్రతిపాదన పెట్టినట్టు తెలుస్తోంది. పర్యావరణ బఫర్ జోన్‌లో జలవిద్యుత్ ప్రాజెక్టు చేపట్టేందుకు వీలు లేదని 2011లో కేంద్ర పర్యావరణశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయినా రాష్ట్రంలో శరావతి ప్రాజెక్టును కొనసాగించేందుకు ముందుకు వెళ్తున్నారు. సూక్ష్మ ప్రదేశంలో నిర్మాణాలు చేపడితే తదుపరి పర్యావరణానికి నష్టం జరుగుతుందని పర్యావరణ నిపుణులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. కొత్తగా ప్రాజెక్టు నిర్మించకపోయినా, ఆధునీకరిస్తే విద్యుత్‌లైన్లు కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందుకు కొత్తగా టవర్‌లు నిర్మాణం తప్పనిసరి కానుంది. ఇలా నిర్మాణాలు కొనసాగుతుంటే పర్యావరణానికి భంగంతోపాటు నిత్యం జనసంచారం కారణంగా ఈ ప్రాంతంలోని వన్యజీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది.

ప్రాజెక్టుతో వ్యతిరేక పరిణామాలు

శరావతి ప్రాజెక్టు ఆధునీకరణ, అనుబంధమైన ప్రాజెక్టు పనులు చేపడితే కొత్తగా రోడ్లు నిర్మించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. సొరంగ మార్గాలు



నిర్మించాల్సి ఉంటుంది. తద్వారా వన్యప్రాణుల జీవనం ఛిద్రం కానుంది. ప్రాజెక్టు అంగీకారం తెలిపినప్పటి నుంచి వన్యజీవులకు నష్టం కలగనుంది. ప్రాజెక్టు నిర్మాణాలు చేపడితే కొన్నేళ్లపాటు సిబ్బంది, వాహనాలు నిరంతరంగా సంచరిస్తాయి. తద్వారా కాలుష్యంతోపాటు వన్యజీవుల మనుడ ప్రశ్నార్థకం కానుంది. నిర్మాణాలు కనీసం ఐదేళ్లపాటు కొనసాగనుందని అంచనా వేశారు. ఇంత సుదీర్ఘమైన కాలం పనులు కొనసాగితే అడవితోపాటు వన్యప్రాణుల జీవనానికి ఇబ్బంది కలగనుంది. పైగా భూమి కుంచించుకుపోవడం, శబ్ద కాలుష్యం వంటివి చోటు చేసుకోనున్నాయి. సొరంగ మార్గాల నిర్మించే సమయంలో తవ్వకాలు కొనసాగించాల్సి ఉంటుంది. తద్వారా పేలుడు పదార్థాలు ఉపయోగిస్తారు. ఈ కారణంగా పరిసర ప్రాంతాలలో భూకంపం వచ్చే అవకాశాలు ఉంటాయి.

ప్రాజెక్టు ఆధునీకరణ కోసం అటవీప్రాంతంలో కనీసం 15వేల చెట్లను తొలగించాల్సి ఉంటుంది. జలవిద్యుత్ ప్రాజెక్టుకు అడవి వినియోగంపై వేర్వేరుగా అనుమతులకోసం ప్రస్తావనలు పంపరాదని కేంద్ర పర్యావరణశాఖ ఇప్పటికే సూచించింది. ప్రస్తుతం విద్యుత్ మార్గ నిర్మాణంపై స్పష్టత లేదు. దీంతో ఎంతమేర అటవీప్రాంతం ఉపయోగిస్తారనేది అంచనా వేయలేదు. కానీ కేబినెట్‌లో ఆమోదించారని డీసీఎఫ్‌లు సైతం నివేదికలు ఇచ్చారు. అయితే శరావతి ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకిస్తూ తొలుత వ్యతిరేకంగా నివేదికలు ఇచ్చిన అధికారులు, కేబినెట్ నిర్ణయంతో ఎందుకు మార్పు చేశారనేది హసిరసుసాగర సంస్థ ప్రతినిధులు మండిపడుతున్నారు.

రాజకీయంగా అణగదొక్కేందుకే

'గాలి' కుట్ర

శ్రీరాములు సంచలన ఆరోపణ


శ్రీరాములు


గాలి జనార్దన్‌రెడ్డి

బళ్లారి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరంటారు. సాధారణంగా శత్రువులు పరిస్థితులకు అనుకూలంగా మిత్రులవుతారు. కానీ రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆప్తుడని ముద్ర వేసుకున్న గాలి జనార్దనరెడ్డి పైనే మాజీ మంత్రి శ్రీరాములు తీవ్రమైన ఆరోపణలు చేశారు. రాజకీయంగా అణగదొక్కేందుకు కుట్ర పన్నారని సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర బీజేపీలో గందరగోళంతోపాటు అధ్యక్షుడి మార్పు వంటి అంశాలపై మంగళవారం కోర్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్ మాజీ మంత్రి శ్రీరాములుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సండూరు శాసనసభ ఉప ఎన్నికల్లో మీ పనితీరు సరిగా లేదని అగర్వాల్ వ్యాఖ్యానించడంతో ఒక్కసారిగా శ్రీరాములు ఖంగు తిన్నాడు. ఓటమిపై సదానందగౌడ సబ్ కమిటీ నివేదిక ఇవ్వకముందే ఎలా మాట్లాడతారని సభలోనే ప్రశ్నించారు. అనంతరం శ్రీరాములు మీడియాతో మాట్లాడుతూ అభ్యర్థి తరఫున పనిచేశానని, నియోజకవర్గానికి వెళ్తే నా పనితీరును కార్యకర్తలు వివరిస్తారన్నారు. రాధామోహన్‌దాస్ అగర్వాల్ వ్యాఖ్యలు తనను బాధించాయన్నారు. పార్టీకి అంకితభావంతో పనిచేసిన కార్యకర్త అని, నా పట్ల చులకనగా మాట్లాడడం బాధ కలిగించిందన్నారు. నా గురించి గాలి జనార్ధనరెడ్డి వ్యతిరేకంగా మాట్లాడినట్టు తెలిసిందన్నారు. ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడికి వివరించానన్నారు. రాజకీయంగా తనను అణగదొక్కాలనే కుట్రగా ఉందన్నారు. కాగా మరో రెండు నెలల్లో రాజకీయంగా మరిన్ని మార్పులు చోటు చేసుకుంటాయని బసనగౌడపాటిల్ యత్నాళ్ ప్రతిపక్షనేత అవుతారని బీజేపీ ఎమ్మెల్యే బీపి హరీశ్ వ్యాఖ్యానించారు. పార్టీలో గందరగోళ పరిస్థితికి ఇలాంటి వ్యాఖ్యలే కారణమయ్యాయి.

ప్రతి జిల్లా అధ్యక్ష పదవికి ముగ్గురి పేర్లు

పార్టీ జిల్లా అధ్యక్ష స్థానానికి ముగ్గురి పేర్ల సిఫారసుకు కమిటీ నిర్ణయించింది. బీజేపీ కోర్ కమిటీ తాజా రాజకీయాలపై చర్చించాక ఒక నిర్ణయం తీసుకున్నారు. 31 జిల్లాలకు పార్టీ అధ్యక్ష స్థానంకోసం పలువురు పోటీ పడుతున్న తరుణంలో క్రియాశీలకంగా వ్యవహరించే ముగ్గురిపేర్లను సిఫారసు చేయాలని కోర్ కమిటీ నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ సీఎంలు సదానందగౌడ, బసవరాజ్ బొమ్మై, మాజీ మంత్రి శ్రీరాములు ఇదే అభిప్రాయాన్ని అంగీకరించారు. రాష్ట్ర అధ్యక్షుడి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రంలో అంతర్గత కలహాలకు స్వస్తి పలికేందుకు అధిష్ఠానం త్వరలోనే రంగంలోకి దిగే అవకాశం ఉంది.


కామిక్‌కాన్ ప్రదర్శనలో సందడి..

అలరించిన కామిక్‌కాన్

బెంగళూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో పాప్ సంస్కృతి ఉత్సవ్‌గా నిర్వహించే కామిక్‌కాన్ అలరించింది. నగరంలోని పన్నెండో విడత కేటీపీఓ ట్రేడ్ సెంటర్‌లో జరిగింది. ప్రదర్శనలో కామిక్స్ అనిమె, మంగా, గేమింగ్, సూపర్‌హీరో క్యారెక్టర్‌ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రెండురోజులపాటు జరిగిన కామిక్‌కాన్‌ను 50వేలమంది సందర్శించగా 5వేలమంది కాస్‌ప్లేయర్స్ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రజాదరణ పొందిన లుఫి, నరుటో, వెడ్‌నెస్‌డే ఆడమ్, బ్యాట్‌మ్యాన్, స్పైడర్‌మ్యాన్‌తోపాటు దేశీయ అభిమానులు ఇష్టపడే ఆవేశంనరంగ, చాచా చౌదరి, సుప్పండి కేరక్టర్‌లను ప్రదర్శించారు. ఫిబ్రవరి 8 నుంచి చెన్నైలో షో ఉంటుందని కామిక్‌కాన్ ఇండియా ఫౌండర్ జతిన్‌వర్మ, కో ఫౌండర్ అక్షత్ రాటి బుధవారం ప్రకటించారు.

నన్ను సస్పెండ్ చేసే సత్తా నాయకులకు లేదు

- జీటీ దేవెగౌడ

బెంగళూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీలో తనను సస్పెండ్ చేసే సత్తా ఉన్న నాయకులు లేరని ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ అన్నారు. బుధవారం మైసూరులో రామ్‌లల్లా విగ్రహానికి ఉపయోగించిన రాయిని వెలికితీసిన ప్రదేశంలో పూజ చేశారు. అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహం ఏర్పాటైన సందర్భంగా పూజలు జరిపారు. ఇదే సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జేడీఎస్‌లో తనను, బీజేపీలో యత్నాళ్‌పై చర్యలు తీసుకోవాలంటే సత్తా ఉండాలన్నారు. ఏం చేస్తారో వేచి చూస్తామన్నారు. పార్టీని పటిష్టం చేసే నాయకుడికి వేటు వేసే అధికారం ఉంటుందని, అటువంటి వారు ఎవరున్నారని ప్రశ్నించారు. సీఎం సిద్దరామయ్య ముడా వివాదంలో రాజీనామా చేయాల్సిన పనిలేదన్నారు. రాజకీయంగా ఎవరెవరిపై ఎన్నికేసులు ఉన్నాయనేది అందరికీ తెలుసునన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ

ఆయన్ను చూస్తే...ధైర్యం
రొమ్ము విరుచుకుని నవ్వుతుంది.
ఆపేరు కలలో వచ్చినా...
ప్రత్యర్థులకు నిద్ర కరువవుతుంది.
సాహసానికి మారుపేరుగా...
సంచలనాలకు చిరునామాగా..
అన్యాయాలు, అరాచకాలు,
అకృత్యాలకు సింహస్వప్నంగా..
బడుగు, బలహీన
వర్గాలకు కొండంత అండగా
పెత్తందార్ల అగడాలను
దహించే నిప్పు కణికగా ..
కారు చీకట్లను చీల్చిన మెరుపుగా..
కష్టాలు, కన్నీళ్లు, ఆకలి, అన్యాయాలకు
ఎదురొడ్డి పోరాడిన ధీరుడిగా..
పేదింటి ఆడబిడ్డలకు
పెళ్లిళ్లు చేసిన పెద్దకొడుకుగా..
నమ్మిన సిద్ధాంతం కోసం
ప్రాణాలొడ్డిన త్యాగమూర్తిగా..
ఆయన పేరు
చిరస్మరణీయం..స్ఫూర్తిదాయకం
ఆయనే దివంగత పరిటాల రవీంద్ర
ఆయన రాకే జిల్లా
రాజకీయాల్లో ఓ ప్రభంజనం
అనతి కాలంలోనే
జిల్లా రాజకీయానికి
కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి
విలక్షణ వ్యక్తిత్వంతో ప్రజలకు
అభిమాన నాయకుడయ్యారు.
మరణించీ అభిమానుల గుండెల్లో
అస్తమించని 'రవి'గా మారాడు.


ఆంధ్రజ్యోతి పేపర్‌ను చదువుతున్న పరిటాల రవీంద్ర (ఫైల్)

మాజీ మంత్రి పరిటాల రవీంద్ర అంటే ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం. విలక్షణ వ్యక్తిత్వంతో దశాబ్దం పాటు జిల్లా రాజకీయాలను శాసించిన ధీశాలి. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నిరంతరం పోరాటం చేసిన ఆయన దివంగతుడై రెండు దశాబ్దాలు పూర్తవుతోంది. ఈ నెల 24న పరిటాల రవీంద్ర వర్ధంతి. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

– ఆంధ్రజ్యోతి, అనంతపురం





నిప్పు కణిక...

పరిటాల రాకే పెను సంచలనం

- ఇంటి నుంచే ఉమ్మడి జిల్లా రాజకీయం
- ఆ నాలుగు అక్షరాలకు వెలకట్టలేని అభిమానం
- బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి
- పదేళ్ల రాజకీయం... వారసత్వానికి బాసట

రేపు పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి

తండ్రి పరిటాల శ్రీరాములు బాటలోనే...

పరిటాల శ్రీరాములు, నారాయణమ్మ దంపతులకు పరిటాల రవీంద్ర 1958 ఆగస్టు 30న జన్మించారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీ పరిధిలోని వెంకటాపురం ఆయన స్వగ్రామం. ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీకి, నక్సలైట్ ఉద్యమానికి అండాదండా పరిటాల రవీంద్ర కుటుంబం. తండ్రి పరిటాల శ్రీరాములు కమ్యూనిస్టు నాయకులు. ఆ ప్రాంతంలో జరిగే అన్యాయాలు, భూస్వాముల పెత్తందారి విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఆయన మరణానంతరం వారసత్వంగా వచ్చిన భావజాలాన్ని పరిటాల రవీంద్ర భుజానికి ఎత్తుకున్నారు. అప్పటికి ఆయన వయస్సు కేవలం 15 సంవత్సరాలు. ఆ వయస్సులోనే అరాచకాలకు ఎదురొడ్డి నిలిచారు. ఈక్రమంలో తనకు అండగా ఉండే సోదరుడు పరిటాల హరిని ఎన్‌కౌంటర్‌లో పోగొట్టుకున్నారు. భూస్వాములు, ఫ్యాక్షనిస్టుల వేధింపులు అధికమయ్యాయి. అయినా వెరవలేదు. తండ్రి పరిటాల శ్రీరాములు ఏ ఆశయం కోసమైతే పనిచేశారో దాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకే అడుగులు వేశారు. ఈ కాలక్రమంలో అనేక సంఘటనలు జరిగాయి. అప్పటి మాజీ ఎమ్మెల్యే గంగుల నారాయణరెడ్డి హత్య కేసులో పరిటాలను ప్రధాన ముద్దాయిగా చేర్చడంతో అజ్ఞాత జీవితం గడపాల్సి వచ్చింది. అయినప్పటికీ తన కుటుంబానికి బాసటగా ఉంటూ వచ్చిన జనాన్ని సంఘటితం చేసుకుంటూ ఆ వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచారు. నేనున్నానంటూ బడుగు, బలహీన, పీడిత వర్గాలకు అండగా నిలబడ్డారు.



మలుపు తిప్పిన 1983 ఎన్నికలు

ఉమ్మడి రాష్ట్రంలో 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు పరిటాల రవీంద్ర జీవితాన్ని అనుకోని మలుపులు తిప్పాయి. అప్పటి వరకూ కాంగ్రెస్ పార్టీ పాలన సాగించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రేసేతర ప్రభుత్వాన్ని స్థాపించి ఆంధ్రుల అభిమాన నటుడు ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక నూతన ఒరవడికి బీజం పడింది. అప్పటి వరకూ అజ్ఞాత జీవితం గడుపుతున్న పరిటాల రవీంద్ర 1984లో తన స్వగ్రామం వెంకటాపురం చేరుకున్నారు. అదే సమయంలో అక్టోబరు 27న సునీతను వివాహం చేసుకున్నారు. పరిటాల రవీంద్ర తండ్రి పరిటాల శ్రీరాములు హత్య కేసులో ప్రధాన ముద్దాయి సిద్దప్ప శిక్ష ముగించుకొని జైలు నుంచి బయటికి వచ్చాడు. 1986లో సిద్దప్పను నక్సల్స్ కాల్చి చంపారు. ఈ హత్య కేసులో పరిటాల రవిని ముద్దాయిని చేయడంతో మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. రహస్య జీవితం గడుపుతూనే... అప్పటి నక్సలైట్ ఉద్యమ ప్రముఖుడు కొండపల్లి సీతారామయ్యతో సన్నిహిత సంబంధాన్ని నడిపారు. ఈక్రమంలోనే సిద్దప్ప హత్య కేసు నుంచి బయటపడి తిరిగి వెంకటాపురానికి చేరుకున్నారు. తండ్రి శ్రీరాములు, సోదరుడు హరి సాగించిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే తన కర్తవ్యంగా భావించారు. అదే సందర్భంలో ఫ్యాక్షనిజాన్ని నిర్మూలించాలనే లక్ష్యంగా అడుగులు వేశారు. అందుకు అవసరమైన వనరులును సమకూర్చుకునే మార్గాల మీద దృష్టి సారించారు. ఆ క్రమంలో ఆయనకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ ఏర్పడటంతో ప్రజానాయకుడిగా తొలి అడుగు వేశారు. రాష్ట్రంలోనే తొలి మండల వ్యవస్థ ఎన్నికలు జరగడంతో ఆ ఎన్నికల్లో పరిటాల రవీంద్ర వంద్దతంతో దళిత ఓబన్న అత్యధిక మెజార్టీతో రామగిరి మండల అధ్యక్ష పదవి దక్కించుకున్నాడు. అక్కడి నుంచి ఆయన ప్రజా నాయకుడిగా ప్రజల్లోకి వచ్చారు. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడంతో పరిటాల రవీంద్రపై ప్రత్యర్థులు కక్ష గట్టారు. అయినా తాను నమ్మిన సిద్ధాంతాన్ని పరిటాల వీడ లేదు. కాంగ్రెస్ నాయకుల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచాడు. ఈ క్రమంలో ప్రజల దృష్టిని మరింత ఆకర్షించాడు. రవీంద్రకి రోజు రోజుకు ప్రజా బలం పెరుగుతుండటంతో అతన్ని నక్సలైట్‌గా చిత్రీకరించి మట్టుపెట్టాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయనకు సమాచారం అందింది. దీంతో అప్పటి ఎస్పీ కెప్టెన్ కేవీ రెడ్డి సమక్షంలో 1992లో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఆ మరుసటి రోజు నుంచే పరిటాల రవీంద్ర క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రచారం జోరందుకుంది.

జైలులో నుంచే నామినేషన్.. ఎమ్మెల్యేగా విజయం



1994 ఆగస్టు 7న హైదరాబాదు సమీపంలోని షాద్‌నగర్‌లో జంట హత్యలు జరిగాయి. హతులిద్దరూ అప్పటి పెనుకొండ ఎమ్మెల్యే ఎస్వీ రమణారెడ్డి అనుచరులు కావడంతో ఆ కేసులో పరిటాల రవిని ప్రధాన ముద్దాయిగా చేశారు. జైలు నుంచే పెనుకొండ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా పరిటాల రవీంద్ర నామినేషన్ వేశారు. అన్ని అవాంతరాలను అధిగమించి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందాడు. రాష్ట్రంలోనూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మంత్రివర్గంలో కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో... రాజకీయ సంక్షోభం రావడం... చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం వరుసగా జరిగిపోయాయి. ఎన్టీఆర్ మరణించిన తర్వాత ఎమ్మెల్యే పదవికి పరిటాల రవీంద్ర రాజీనామా చేశారు. తిరిగి ఉప ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ తరఫున విజయం సాధించాడు. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లా రాజకీయాల్లోనే కాదు... రాష్ట్ర రాజకీయాల్లో పరిటాల రవీంద్ర తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించిన నాయకుడిగా ఆ వర్గాల్లో అభిమానాన్ని చాటుకున్నాడు. వేలాది మంది పేదింటి బిడ్డలకు ఉచిత పెళ్లిళ్లు చేసి ఆ కుటుంబాలకు పెద్ద దిక్కయ్యాడు. మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో చైతన్యం నింపారు. ఆయన రాజకీయాల్లో పదేళ్లు ఉన్నా ఆ కుటుంబానికి వెయ్యేళ్ల వారసత్వ రాజకీయాన్ని అందించారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయనను అంతమొందించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఈ విషయం తెలిసినా వెరవక ప్రజల కోసం నిలబడ్డాడు. ఆ క్రమంలోనే 2005 జనవరి 24న హత్యకు గురయ్యారు. అయితే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, తన ప్రాంత అభివృద్ధి కోసం పరిటాల రవీంద్ర ఎలా పాటుపడ్డారో ఆవిధంగానే ఆయన సతీమణి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆయన తనయుడు పరిటాల శ్రీరామ్‌లు కృషి చేస్తున్నారు.


సీఎం చంద్రబాబు నాయుడుతో (ఫైల్)


భార్య పరిటాల సునీతతో (ఫైల్)

చెస్‌లో చిచ్చర పిడుగు

అంతర్జాతీయ పోటీలకు అరవ విశ్వాణి


రన్నరప్ ట్రోఫీతో అరవ విశ్వాణి

అనంతపురం క్లాక్‌టవర్/గుంతకల్లు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025, ఫిడే వరల్డ్ స్కూల్ చెస్ చాంపియన్ షిప్-2025 పోటీలకు గుంతకల్లుకు చెందిన అరవ విశ్వాణి అర్హత సాధించింది. ఇటీవల కాకినాడలో నిర్వహించి న నేషనల్ చెస్ పోటీల్లో ఈమె రన్నరప్ టైటిల్ కైవసం చేసుకున్నారు. త్వరలో ఏషియన్, వరల్డ్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల తేదీ, వేదికను ప్రకటిస్తారని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్ష డు బాలరాజు తెలిపారు. గుంతకల్లులోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బాలికను చెస్ అసోసియేషన్ కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు, ఆంధ్రా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నాగార్జున తదితరులు అభినందించారు.

మెరుగైన మార్కులు సాధించండి: డీఈఓ

అనంతపురం విద్య, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదుకుని టెస్ట్‌లో మంచి మార్కులు సాధించాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించా రు. రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్టీయూ స్టడీమెటీరియల్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, సంఘ సేవకురాలు ఏజీ ప్రమీలమ్మ చేతులమీదుగా వీటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులు, నిపుణులైన టీచర్లు తయారు చేసిన మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ సుమారు 500 మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుక, ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర మున్సిపల్ కమిటీ కన్వీనర్ ఫణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల ఆగ్రహం

- సహాయ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- అనంతలో అర్చక, పురోహితుల నిరసన
- దేవదాయశాఖ ఏసీ కార్యాలయం వద్ద ధర్నా


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అర్చకులు, పురోహితులు

అనంతపురం కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్చక పురోహితుల పట్ల నీచంగా ప్రవర్తిస్తున్న జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదిశేష నాయుడును వెంటనే సస్పెండ్ చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. సహాయ కమిషనర్ తీరును నిరసిస్తూ బుధవారం ఉమ్మడి జిల్లాలోని అర్చక పురోహితులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హెచ్చెల్సీ కాలనీలో తహసీల్దార్ కార్యాలయం నుంచి దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం సహాయ కమిషనర్ కార్యాలయం లో సూపరింటెండెంట్ రామతులసిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి జేసీ శివనారాయణశర్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైపీ ఆంజనేయులు మాట్లాడు తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెత్ గ్రాట్యుటీ ఫైల్స్‌ను గత మూడేళ్లుగా క్లియర్ చేయకుండా సహాయ కమిషనర్ జాప్యం చేస్తున్నాడని విమర్శిం చారు. అర్చకుడు మృతి చెందితే ఆ కుటుంబంలోని వారికి డీడీఎన్‌ఎస్ పథకం వర్తింపజేయాల్సి ఉన్నా ఆమేరకు చర్యలు చేపట్టడం లేదన్నారు. సమస్యలపై అర్చకులు సహాయ కమిషనర్ కార్యాలయానికి వస్తే వారిని కలవకుండానే వెనక్కు పంపేస్తున్నారన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే అర్చకులు, ఆఖరుకు ఈఓ స్థాయి అధికారులపైనా బూతులతో విరుచుకు పడుతున్నాడన్నారు. సమస్యలు పరిష్కరించకుండా అర్చకుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఆదిశేషనాయుడును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు మారుతీప్రసాద్, కోశాధికారి శ్రీనివాసులు, చేతన్, నవీన్, హనుమంతరాయుడు, గోపాల్, తిరుపతయ్య, చంద్రమౌళి, వెంకటగిరి, మాధవయ్య, రంగనాయకులు, వీరాంజనేయులు, రాజన్న, సునీల్, ప్రజ్వల్, కిరణ్‌స్వామి, విజయ్, ప్రకాష్, వెంకటరాముడు, విజయశాంతి పాల్గొన్నారు.

27న రాయలసీమ కలెక్టరేట్‌ల వద్ద ధర్నా: సీపీఎం

అనంతపురం కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పును కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రాయలసీమ వ్యాప్తంగా ఈనెల 27న అన్ని కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. అనంతపురంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, మదనపల్లి జిల్లాల్లో దాదాపు ఆరు లక్షల ఎకరాలకు పైగా నీళ్లు ఇవ్వడానికి ఉద్దేశించబడింద న్నారు. 2012 నుంచి కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీరు వస్తున్నా ఒక్క ఎకరం ఆయకట్టుకూ సాగునీరు ఇవ్వకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మొదటిదశ కింద అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేందుకు పంటకాల్వలు తవ్వలేదన్నా రు. ప్రభుత్వాలు మారుతున్నా రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధి మాత్రం ఆశించినంతగా జరగడం లేదన్నారు. హంద్రీనీవా నుంచి 10వేల క్యూసెక్కుల నీరు రావడానికి కాలువ వెడల్పు చేయాల్సిన అవసరముందన్నారు. అయితే కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ వేయడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రస్తుతం జీఓ నెం.404, 405 విడుదల చేసిందన్నారు. అయితే కాలువ వెడల్పు చేయకుండా ఇది సాధ్యం కాదన్నారు. లైనింగ్ పనులవల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదముందని రైతుసంఘాలు, జలసాధన కమిటీ, ఇతర రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కలెక్టరేట్‌ల వద్ద చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

మహారాష్ట్ర వ్యక్తి హత్య

డి.హీరేహాళ్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో మహారాష్ట్రకు చెందిన పల్లి శంకర్‌బోస్లే(40) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు మహారాష్ట్రలోని నీరజ్ గ్రామానికి చెందిన పది మంది 15 రోజుల కిందట గ్రామ సమీపంలో టెంట్లు వేసుకొని ఉండేవారు. రెండురోజుల కిందట వారంత అక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. అయితే బుధవారం సాయంత్రం ఓబుళాపురం గ్రామానికి చెందిన కొందరు కాపరులు గొర్రెలను మేపుతూ గ్రామం వైపు వస్తుండగా చెట్ల కింద ఒక వ్యక్తి పడి ఉండటం గమనించారు. దగ్గరికి వెళ్లి చూడగా ఆ వ్యక్తిపై రక్తపు మరకలు ఉండటంతో విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల విచారించగా మృతుడు సంచారజాతికి చెందిన వ్యక్తి అని గ్రామస్థులు పేర్కొన్నట్లు తెలిపారు. పోలీసు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్పీఎఫ్ గణతంత్ర స్ఫూర్తి యాత్ర


పాదయాత్రగా బయలుదేరిన ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

గుంతకల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో రైల్వే రక్షణ దళం విధి నిర్వహణలో పునరంకితం కావాలని ఆర్పీఎఫ్ డీఎస్సీ మురళీకృష్ణ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గణతంత్ర దినోత్సవ స్ఫూర్తి యాత్రను చేపట్టారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఈ మారథాన్ వాక్ ప్రారంభించి, పట్టణం మీదుగా చిప్పగిరి, అక్కడి నుంచి పెంచలపాడు మీదుగా గుంతకల్లుకు చేరే విధంగా 40 కి.మీ.ల పాదయాత్రను డీఎస్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఏఎస్సీ అనిల్ కుమార్ సింగ్, రేణిగుంట ఏఎస్సీ రాజగోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

నేతాజీ సుభాష్ చంద్రబోస్ (జయంతి)



స్వాతంత్ర్య సంగ్రామంలో 'మీ రక్తాన్ని ధారపోయండి... మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను' అనే నినాదంతో చైతన్యం తెచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడు 'నేతాజీ' సుభాష్ చంద్రబోస్ 1897 జనవరి 23న ఒడిశా రాష్ట్రం కటక్‌లో జన్మించారు. సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను తరిమి కొట్టవచ్చునని నమ్మి ఆచరించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైనా గాంధీజీతో సిద్ధాంతపరమైన విభేదాలతో పదవికి రాజీనామా చేశారు. రెండో ప్రపంచయుద్ధంలో ఆంగ్లేయులను ఎదుర్కొనేందుకు జపాన్ సహకారంతో ఖైదీలు, రబ్బరు తోటల కూలీలు, ఔత్సాహికులతో 'ఆజాద్ హింద్ ఫౌజ్' ను ఏర్పాటు చేశారు. 1945 ఆగస్టు 18న విమాన ప్రమాదంలో కన్నుమూశారు.

వావిలికొలను సుబ్బారావు (జయంతి)



ప్రముఖ రచయిత, గ్రాంథికవాది వావిలికొలను సుబ్బారావు 1863 జనవరి 23న కడపలో జన్మించారు. కందుకూరి వీరేశలింగం పంతులు తర్వాత మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితులుగా పనిచేశారు. భక్తి సంజీవని మాసపత్రిక సంపాదకులు. ధర్మసమాజాన్ని స్థాపించారు. సంస్కృతంలోని రామాయణాన్ని 'మందరం' పేరిట ఆంధ్రీకరించి 'ఆంధ్ర వాల్మీకి'గా పేరొందారు. 1920లో సన్యాస దీక్ష స్వీకరించి ఆంధ్ర రాష్ట్రమంతటా పర్యటించారు. ఒంటిమిట్టలోని కోదండ రామాలయాన్ని పునరుద్ధరించడానికి ఎంతో కృషి చేశారు. 1936 ఆగస్టు 1న కన్నుమూశారు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (జయంతి)



శాస్త్రీయమైన సాహితీ విమర్శకు కళాత్మకమైన రూపురేఖలు దిద్దిన అనంతకృష్ణ శర్మ 1893 జనవరి 23న అనంతపురం జిల్లా రాళ్ళపల్లిలో జన్మించారు. అన్నమాచార్యుల కృతులను ఆయన స్వరపరచి తెలుగువారికి అందించారు. వేమనపై సాధికారమైన విమర్శ గ్రంథాన్ని వెలువరించారు. సంగీత, సాహిత్యాలు రెండింటిలోనూ సమస్కందులు. మైసూరు మహారాజా కళాశాలలో 38 ఏళ్లపాటు అధ్యాపకుడిగా వ్యవహరించారు. రేడియోకు ఆకాశవాణి అని పేరుపెట్టింది ఆయనే. గానకళాసింధు, సంగీత కళారత్న పురస్కారాలు పొందారు. 1979 మార్చి 11న కన్నుమూశారు.

ఖాసా సుబ్బారావు (జయంతి)



దేశంలో పేరొందిన పత్రికా సంపాదకులలో ఒకరైన ఖాసా సుబ్బారావు 1896 జనవరి 23న నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో జన్మించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ శిష్యులలో ఒకరు. టంగుటూరు ప్రకాశం ఆధ్వర్యంలో మద్రాస్‌లోని 'స్వరాజ్య' ఆంగ్ల దినపత్రికలో ఉపసంపాదకులుగా పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారు. అనంతరం 'స్వతంత్ర' పత్రికను ఏర్పాటు చేశారు. 1961 జూన్ 16న కన్నుమూశారు.

బాల్ థాకరే (జయంతి)




బాలాసాహెబ్ థాకరే (బాల్‌ఠాక్రే) 1926 జనవరి 23న జన్మించారు. మహారాష్ట్ర రాజకీయాలనే కాక దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన విలక్షణ వ్యక్తి. మరాఠా హక్కుల సాధనకై శివసేన పార్టీని ఏర్పాటు చేశారు. హిందుత్వాన్ని, హిందూ జాతీయవాదాన్ని కూడా బలపరిచారు. కార్టూనిస్ట్‌గా కెరీర్ ప్రారంభించారు. 1995లో శివసేన అధికారంలోకి వచ్చినా ఆయన మాత్రం ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు, ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2012 నవంబరు 17న కన్నుమూశారు.

సిద్ధేశ్వరానంద భారతి స్వామి (పుట్టినరోజు)



కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి 1937 జనవరి 23న ప్రకాశం జిల్లా సంత మాగులూరు మండలం ఏల్చూరులో జన్మించారు. 2002 నుంచి పీఠాధిపతిగా కొనసాగుతున్నారు. డాక్టర్ ప్రసాదరాయ కులపతి (వెంకట లక్ష్మీ వరప్రసాద రావు)గా చిరపరిచితులు. ముత్తాత రామకవి నుంచి కుస్తీ పద్ధతులతోపాటు కవితా ప్రతిభను వారసత్వంగా పొందారు. తెలుగు సాహిత్యంలో అవధాని, ఆశుకవి, వక్త, భువనవిజయం వంటి సాహిత్య నాటకాల నిర్వాహకుడిగా పేరొందారు. శివ సహస్రి, అంబికా సహస్రి వంటి కవితలు ఎంతో పేరొందాయి. అవధాన సరస్వతి, సరస్వతీ కాంత ఆభరణ, కవితా సుధాకర తదితర బిరుదులు పొందారు.

రమేశ్ సిప్పీ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత రమేశ్ సిప్పీ 1947 జనవరి 23న కరాచీలో జన్మించారు. సినీ దర్శకుడు, నిర్మాత. ఆయన దర్శకత్వం వహించిన 'షోలే' సినిమా ఎంతో పేరొందింది. ముంబైలో సొంత సినీ అకాడమీ ఏర్పాటు చేశారు. పలు బుల్లితెర సీరియల్స్‌కు దర్శకత్వం వహించారు. 2020లో ఫిల్మ్‌ఫేర్ జీవితసాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. ఆయన కుమారుడు రోహన్ సిప్పీ కూడా దర్శకుడిగా రాణిస్తున్నారు.

అటవీశాఖ గోడౌన్ దోపిడీకి యత్నం

ముళబాగిలు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ గోడౌన్ బీగాలు పగులగొట్టేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా కుమదేనహళ్ళి సమీపానగల అటవీశాఖ గోడౌన్‌ను దోచేందుకు ప్రయత్నించారు. ఇందుకు పాల్పడిన సరిహద్దు లోని ఆంధ్రప్రదేశ్ మదనపల్లికి చెందిన పవన్, కురుడుమలె గేట్‌కు చెందిన చేతన్‌లను అదుపులోకి తీసుకున్నట్టు అటవీశాఖ అధి కారులు తెలిపారు. అటవీశాఖ స్వాధీనం చేసు కున్న ఎర్రచందనం ఇతరత్రా విలువైన వస్తు వులు గోడౌన్‌లో ఉన్నాయి. వీటిని దోచేందుకు వ్యక్తులు కుట్ర పన్నారని ముళబాగిలు ఆర్‌ఎఫ్‌ఓ శాలిని తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

చింతామణిలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

» ఎన్‌హెచ్, నగరసభ సంయుక్త కార్యాచరణ

చింతామణి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని ప్రధాన రహదారులు, పాదచారులు ఆక్రమణల తొలగింపులో నగరసభ విజయవంతమైంది. ప్రస్తుతం నిత్యం రద్దీగా ఉండే ఎంజీ రోడ్డులోని ఆక్రమణలను జాతీయ రహదారి అధికారులు, నగరసభ సంయుక్తంగా బుధవారం కార్యాచరణ నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టారు. జాతీయ రహదారి 234, ఎంజీ రోడ్డులో ఆక్రమణలు తొలగించారు. భారీగా పొక్లైనర్‌లు కార్యాచరణలోకి దింపారు. మొదటి, రెండు విడతలు నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి నేతృత్వంలో కార్యాచరణ సాగింది. మూడో విడతలో జాతీయ రహదారి అధికారులు ఏఈఈ మల్లికార్జున్, నగరసభ కమిషనర్ చలపతి, జిల్లా ఎస్పీ కుశల్‌చౌక్సి నేతృత్వం వహించారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ వి కోట నుంచి ముళబాగిలు మార్గంలో మూడుబిదరెకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి ఎంజీ రోడ్డులో వాహనరద్దీ నివారణకు చర్యలు చేపట్టారు. కార్యాచరణలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



పోలీసుల బందోబస్తు



ఆక్రమణలను కూల్చివేస్తున్న సిబ్బంది

తప్పుడు సమాచారంతో స్టే.. హైకోర్టు మందలింపు



కారహళ్ళి గ్రామపంచాయతీ కార్యాలయం

బంగారపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి గ్రామ పంచాయతీ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరగ కుండా స్టే తెచ్చిన ఇద్దరు సభ్యులకు హైకోర్టు మందలించి పెట్టి తలా రూ.50వేలు జరిమానా విధించింది. వివరాలిలా. తాలూకాలోని కారహళ్ళి గ్రామపంచాయతీకి ఖాళీ అయిన అధ్యక్షస్థానానికి ఈనెల 20న ఎన్నికలు జరిపేలా నిర్ణయించారు. అయితే ఇదే గ్రామ పంచాయతీకి చెందిన సభ్యులు తిమ్మాపుర కృష్ణమూర్తి, ఆయన భార్య గిరిజమ్మలు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి ఈనెల 17న స్టే పొందారు. అధ్యక్షుడు ఎం నారాయణ స్వామి రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఈనెల 20న ఎన్నికలు జరిపేలా అధికారులు నిర్ణయించారు. గ్రామపంచాయతీ పరిధిలోని మొత్తం 19మంది సభ్యులకు పోస్టల్ ద్వారా రిజిస్టర్ నోటీసు పంపారు. అయితే భార్యాభర్తలు మాత్రం నోటీసును తిరస్కరించారు. మిగిలిన 17మంది తీసుకున్నారు. ఈలోగా సభ్యులిద్దరూ కోర్టునుంచి స్టే పొందారు. దీనిపై స్థానిక ఎన్నికల అధికారులు హైకోర్టుకు అన్ని రికార్డులను మంగళవారం సమర్పించారు. ఇద్దరు సభ్యులు తప్పుడు సమాచారం సమర్పించినట్టు గుర్తించి కృష్ణమూర్తి, గిరిజమ్మలకు తలా ఒక లక్ష జరిమానా విధించారు. అయితే వీరి తరపు న్యా యవాదులు జరిమానాను తగ్గించాలని న్యాయ మూర్తికి విన్నవించడంతో తలా రూ.50వేల మొత్తాన్ని రెండు వారాలలోగా కోర్టుకు చెల్లిం చాలని ఆదేశించారు. వచ్చేవారం ఖాళీగా ఉన్న కారహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరపాలని తీర్పునిచ్చారు.

బంగ్లాదేశీయులను తిప్పిపంపుతాం

మహదేవపుర, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చుట్టుపక్కల ప్రాంతాలలో అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశీయులను తిప్పిపంపుతామని మాజీ మంత్రి అరవింద లింబావళి తెలిపారు. ఇంటిపని, ఇతర పనులకోసం పలువురు ఇక్కడ అక్రమంగా చేరారన్నారు. వర్తూరు సంక్రాంతి ఉత్సవ 2025 కార్యక్రమాన్ని మాజీ మంత్రి అరవింద లింబావళి, ఎమ్మెల్యే మంజుళా, నటుడు డాలి ధనంజయ గోపూజ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ నడియాడే దేవుడిగా పేరొందిన త్రివిధ దాసోహి శివకుమారస్వామి వర్ధంతిని దాసోహదినంగా ఆచరిస్తున్నారంటూ ఆయన భావచిత్రానికి పుష్పాంజలి ఘటించారు. కన్నడ గాయని అనన్యభట్, జీ కన్నడ ఫేం కామెడి గిల్లి నటరాజ్, వాణి తదితరుల గాయాలాపన ఆకట్టుకుంది. కార్యక్రమంలో బెంగళూరు కేంద్ర జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మహేంద్రమోది, హోబళి పట్టణ అధ్యక్షుడు ఆర్ శ్రీధర్‌రెడ్డి, తాజా మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పరిషత్ సభ్యుడు రాజేశ్, వర్తూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వర్తూరు సంక్రాంతి ఉత్సవ్‌లో ఎమ్మెల్యే దంపతులు

చన్నరాయనపల్లిలో గ్రామ జాతర



జాతరలో కలశాలతో మహిళల ఊరేగింపు

బాగేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గూళూరు హోబళి చన్నరాయనపల్లి గ్రామంలో 18ఏళ్ల అనంతరం గ్రామజాతర సంబరంగా సాగింది. మారమ్మదేవి, చన్న కేశవ స్వామి, ఆంజనేయస్వామి, వెంకటరాయస్వామి, ఈశ్వర దేవ స్థానాలలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు కళశాలు మోసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఇంటింటి మాంసాహార వంటలు చేశారు. బంధుమిత్రులు తరలివచ్చారు. గ్రామానికి చెందిన యువ ప్రముఖుడు కార్తీక్ మాట్లాడుతూ 41 రోజులుగా మారమ్మదేవికి పూజలు చేస్తున్నారన్నారు. ఎటు చూసినా జాతర సందడి నెలకొంది. ఉత్సవంలో గ్రామ ప్రము ఖులు రంగస్వామి, జేపీసీ శివప్ప, ఎన్ఆర్ నాగరాజ్, కేవీ శ్రీనివాస్, దేవరాజ్, శ్రీనాథ్, జయకుమార్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రాంట్లు కేటాయించాలి

బెంగళూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): భూమి, గంగాకల్యాణ, ఉద్యోగ అవకాశాలకు సంబంధించి వచ్చే బడ్జెట్‌లో ప్రత్యేక గ్రాంట్లు కేటాయించాలని కోరుతూ దళిత హక్కుల సమితి ఆధ్వర్యంలో నగరంలో బుధవారం ఫ్రీడం పార్కులో భారీ నిరసన చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లను సద్వినియోగం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రత్యేక గ్రాంట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బగర్ హుకుం దారులకు హక్కుపత్రాలు ఇవ్వాలని, ప్రస్తుత సంవత్సరంలో గంగా కల్యాణ పథకానికి రూ.250కోట్లకు బదులు రూ.3వేలకోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దళితుల అభివృద్ధిలో నిర్లక్ష్యం సరికాదన్నారు. వివిధ ప్రాంతాలనుంచి నిరసనలో పెద్దసంఖ్యలో పాల్గొన్న సంఘం సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు.



ఫ్రీడంపార్కులో దళితహక్కుల పోరాట సంఘం నిరసన

గ్యాస్ వినియోగదారుల కేంద్రం ప్రారంభం

బెంగళూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు గ్యాస్ సరఫరాతోపాటు సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తున్న పూనె గ్యాస్ నగర ప్రజలకోసం తన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. చామరాజపేటలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని రామేశ్వరం కెఫె సీఈఓ రాఘవేంద్రరావు, ఎండీ దివ్యలు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. పూనె గ్యాస్ ఫౌండర్ ఛైర్మన్ జయసింహ సంపత్, ఈడీ జెసాల్ సంపత్‌లు మాట్లాడుతూ దేశంలో నాల్గో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ద్వారా మరింతమంది వ్యాపార వర్గాలకు చేరువయ్యామన్నారు. స్మార్ట్ ఎల్‌పిజి సిస్టమ్‌ను పరిచయం చేస్తున్నామన్నారు. సాధారణంగా సిలిండర్‌లో గ్యాస్ ద్రవరూపంలో ఉంటుందని, వాడకం ద్వారా పైనుంచి గ్యాస్ తగ్గుతూ వస్తుంటుందన్నారు. కానీ స్మార్ట్ విధానంతో ఓ ప్రత్యేకమైన పైప్‌ను ఫ్యూయెల్ ఫ్యూజన్ అమరిక ద్వారా గ్యాస్ కిందభాగం నుంచి తగ్గుతూ వస్తుందన్నారు. తద్వారా వినియోగంతోపాటు నాణ్యత పెరుగుతుందన్నారు. లిక్విడ్ ఆఫ్ టేక్‌ను అన్ని వర్గాలకు పరిచయం చేయాలన్నదే మా ఆశయమన్నారు. అన్ని గ్యాస్ కంపెనీల చెంతన ప్రత్యేక సిలిండర్‌లను పొందాలన్నారు.

ఆభరణాల ఎంపికలో జాగ్రత్తలు ముఖ్యం

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆభరణాలు, వజ్రాల ఎంపికలో జాగ్రత్తలు ముఖ్యమని నమ్మకం, విశ్వాసం కల్గిన చోటే పొందాలని జోస్ అలుక్కాస్ ఎండీ వర్గీస్ అలుక్కాస్ అభిప్రాయపడ్డారు. సహజ సిద్ధమైన వజ్రాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వజ్రాభరణాలు 28శాతం విక్రయాలు పెరిగాయన్నారు. ఇటీవలే నైసర్గిక వజ్రమండలి (ఎన్‌డీసీ)తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ బంగారంతోపాటు ఇష్టమైనవారికి వజ్రాలతో కూడిన ఆభరణాల కొనుగోలుకు ఆసక్తి పెరుగుతోందన్నారు. ప్రధానంగా నిశ్చితార్థం, పెళ్లి, తదితర శుభకార్యాల వేళ సహజసిద్ధమైన వజ్రా భరణాలకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. భారత్ సహా మధ్యప్రాచ్యదేశాల వజ్రమండలి ఎన్‌డీసీ ఎండీ రిచాసింగ్ అభిప్రాయం మేరకు సహజ సిద్ధమైన వజ్రాల మార్కెటింగ్‌కు జోస్ అలుక్కాస్‌తో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు.

వివాహితను పలకరించాడని దాడి

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వివాహితతో ఫోన్‌లో ఓ యువకుడు మాట్లాడాడని గుర్తించిన బంధువులు యువకుడిని చితకబాదిన సంఘటన హుబ్బళ్ళిలో చోటు చేసుకుంది. కసాబాపేట టిప్పు నగర్‌లో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఓ వివాహితతో నగరానికి చెందిన ముజాఫిర్ అనే యువకుడు ఫోన్‌లో మాట్లాడాడు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు బుధవారం అతడు పని చేసే చోటుకు వెళ్లి బట్టలూడదీసి చితకబాదారు. అక్కడనుంచి టిప్పు నగర్‌కు తీసుకొచ్చి ఇంటికి వెళ్లాలంటూ వదిలేశారు. బ్లేడ్‌లతో ముజాఫిర్‌ను గాయపరిచారు. దీంతోట ముజాఫిర్ బంధుమిత్రులు సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహ్మద్ మాబులి, నదీం, సమీర్‌తోపాటు పలువురిపై ఫిర్యాదు చేయగా కొందరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముళబాగిలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ముళబాగిలు తాలూకాలోని జాతీయ రహదారి కోలారు రోడ్డు వి.గుట్టహళ్ళిగేట్ వద్ద బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి కారు ఒకటి ఢీ కొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ద్విచక్రవాహనదారుడు వరదగానహళ్ళికి చెందిన కృష్ణప్ప ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్విఫ్ట్ డిజైర్ కారులో బెలూన్ వెలువడ్డంతో అందులోనివారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై మమతా, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యంమత్తులో యువకుడిపై దాడి

దొమ్మసంద్ర, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని కావేరి కళాశాల సమీపాన ఓ యువకుడిని మద్యం మత్తులో ఆరుగురి గుంపు కిడ్నాప్ చేసి తీవ్రంగా దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. కువెంపు నగర్ నివాసి మురళి (31) దాడికి గురైన వ్యక్తిగా తెలుస్తోంది. ఓబిఎల్‌ఎఫ్ అనే స్వచ్ఛ సంస్థలో పనిచేసే మురళి మంగళవారం సాయంత్రం పని ముగించుకుని అక్క కూతూరును కళాశాలనుంచి వాపసు తీసుకొచ్చేందుకు వెళ్లాడు. కళాశాల సమీపాన లే అవుట్‌లోని మూత్ర విసర్జన కోసం బైక్‌ను ఆపాడు. అక్కడ ఉన్న ఆరుగురు బృందం ఒక్కసారిగా అతడిని కిడ్నాప్ చేశారు. గూగుల్‌పేలో డబ్బు ఇవ్వాలంటూ బెదరించారు. అయితే మురళి నిరాకరించడంతో అతడిని తీవ్రంగా గాయపరిచారు. మురళికి చెందిన డియో బైక్, మొబైల్‌ను లాక్కుని దుండగులు వెళ్లిపోయారు. వీరంతా గంజాయి, మద్యం కోసం యువకుడిని దాడి చేసినట్టు తెలుస్తోంది. మురళి కొంత సమయం తర్వాత మెయిన్‌రోడ్డుకు వచ్చాక స్థానికుల సాయంతో ఆనేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమచికిత్స పొందిన అనంతరం బెంగళూరు విక్టోరియా ఆసుపత్రిలో చేరాడు. సమాచారం అందుకున్న ఆనేకల్ డీఎస్పీ మోహన్‌కుమార్ పరిశీలించారు. ఆనేకల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



డాకు మహారాజ్.. కేక

అభిమానుల సమక్షంలో విజయోత్సవం... పాటపాడి.. తొడగొట్టి అలరించిన బాలయ్య... తరలివచ్చిన తారాగణం.. టీడీపీ నాయకులు



డాకు మహారాజ్ విజయోత్సవ సభలో పాల్గొన్న బాలకృష్ణ, హీరోయిన్లు, డైరెక్టర్ తదితరులు

అనంతపురం కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): డాకు మహారాజ్ విజయోత్సవం వేలాది మంది అభిమానుల మధ్య అట్టహాసంగా జరిగింది. అనంతపురం శివారులోని శ్రీనగర్ కాలనీలో బుధవారం రాత్రి నిర్వహించిన వేడుకకు హీరో నందమూరి బాలకృష్ణ సహా చిత్ర యూనిట్ హాజరైంది. ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ జగదీష్ చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 7.20 గంటలకు ప్రారంభమైన వేడుక రాత్రి 11 గంటల వరకూ సాగింది. శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఎన్బీకే హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో బాలయ్య పాటలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. బాలకృష్ణ 50 సంవత్సరాల సినీ ప్రస్థానానికి సంబంధించి 3డి యానిమేషన్ చిత్రాన్ని ప్రదర్శించారు. దర్శకుడు బాబీ విజిల్ వేస్తూ 'చిన్ని చిన్ని' పాటను, బాలకృష్ణ 'గణ గణ గణాగణ' పాట పాడుతూ అభిమానులను అలరించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, మాజీ మేయర్ స్వరూప, రాయల్ మురళి, ఎన్బీకే హెల్పింగ్ హ్యాండ్స్ జగన్, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, సంగా తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన తారలు

డాకు మహారాజ్ సక్సెస్ మీట్‌కు నటుడు బాబీ డియోల్, హీరోయిన్లు ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధ శ్రీనాథ్, ఊర్వశీ రౌతేలా, బాలనటి వేద అగర్వాల్, సంగీత దర్శకుడు తమన్, చిత్రదర్శకుడు బాబీ కొల్లి, నిర్మాత నాగవంశీ, డీఓపీ విజయ్ కార్తీక్ కన్నన్, రచయిత మోహన్ కృష్ణ వచ్చారు.

ఊపిరి ఉన్నంతవరకూ నటిస్తా: బాలకృష్ణ


అభిమానులు కాలర్ ఎగరేసి గర్వపడేలా చూసుకునే బాధ్యతను తన తండ్రి నందమూరి తారకరామారావు తనపై ఉంచారని బాలకృష్ణ అన్నారు. ఆయన స్ఫూర్తితో కొన ఊపిరి ఉన్నంతవరకూ నటిస్తానని, సందేశాత్మక చిత్రాలతో అలరిస్తానని అన్నారు. నటసార్వభౌముడు ఎన్టీఆర్ పుట్టిన తెలుగుగడ్డపై మనమంతా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమని అన్నారు. వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా తనను గెలిపించిన సీమ బిడ్డలను మరవలేనని అన్నారు. తన అభిమానులే తన నిజమైన ప్రచారకర్తలు అని అన్నారు. దేశానికి ఒక రాష్ట్రపతిని, ఉమ్మడి రాష్ట్రానికి ఆరుగురు ముఖ్యమంత్రులను ఇచ్చిన రాయలసీమ.. రాయల్ సీమ అని అన్నారు.

రెట్టింపు హిట్‌తో వస్తా: బాబి కొల్లి, దర్శకుడు

గతంలో తాను తీసిన సినిమాలన్నీ విజయాన్ని తెచ్చిపెడితే డాకు మహారాజ్ మాత్రం విజయంతోపాటుగా ఆనందాన్ని, కోట్ల మంది అభిమానాన్ని తెచ్చిపెట్టిందని దర్శకుడు బాబి కొల్లి అన్నారు. ప్రతి ఒక్కరూ ఇష్టపడి పనిచేయడం వల్లే ఇంతటి ఘన విజయాన్ని సాధించామని అన్నారు. డాకు మహారాజ్‌కు రెట్టింపు హిట్ కొట్టే సినిమాతో, రాష్ట్రాలు కాకుండా దేశాలు మాట్లాడే స్థాయిలో సినిమాతో వస్తానని అన్నారు.

చెప్పాం.. కొట్టాం.. : ఎస్ఎస్ థమన్

డాకు మహారాజ్‌తో హిట్ కొడతామని, అనంతపురంలో సక్సెస్ మీట్ పెడతామని ప్రీ రిలీజ్ సమయంలోనే చెప్పామని సంగీత దర్శకుడు థమన్ అన్నారు. అన్నట్లుగానే హిట్ కొట్టామని, అనంతపురంలో సక్సెస్ మీట్ పెట్టామని అన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1620.28	1,588.86
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11.243	0
నీటి నిల్వ (టీఎంసీలు)	62.12	10.10

హెల్మెట్ తప్పకుండా ధరించాలి

అవగాహన సదస్సులో ట్రాఫిక్ పోలీసులు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బళ్లారిరూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్‌ను తప్పకుండా వాడాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. నగరంలో బుధవారం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయ్యన్నగౌడ పాటిల్ నేతృత్వంలో రాయల్, మోతీ, ఇంద్ర సర్కిళ్లతోపాటు పలు కూడళ్లలో హెల్మెట్ వాడకంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయ్యన్నగౌడ పాటిల్ మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తలకు గాయాలు కాకుండా ఉండటంతోపాటు పొల్యూషన్ కేర్‌గా కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రవివాణి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

బళ్లారి సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం, జిల్లాపాలనా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, ట్రాఫిక్ పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ట్రాఫిక్ పోలీసు విభాగం ప్రత్యేక శిక్షణను కూడా నిర్వహించింది. ట్రాఫిక్ పోలీసు విభాగం ఇన్‌స్పెక్టర్ అయ్యనగౌడపాటిల్, ఏఎస్సై షఫీవుల్లా, నెహ్రూ యువ కేంద్రం అధికారి మోంటు పత్తార్ తదితరలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ వేషధారణలో పిల్లలు



గాంధీ వేషధారణలో పిల్లలు

బళ్లారి గాంధీనగర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బెళగామ్‌లోని కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. హుబ్లి తాలూకా దేవగుడిహాల్, ఈశ్వర్‌నగర్‌కు చెందిన 101 మంది పిల్లలు గాంధీ వేషధారణతో సమావేశంలో కనిపించడం ప్రత్యేకతను సంతరించుకుంది. పలువురు వారితో సెల్ఫీ దిగేందుకు పోటీపడ్డారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

న్యాయాధికారి రాజేష్ హొసమనె



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి

బళ్లారి సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళల పాత్ర కీలకమని సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాపాలన యంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, పాఠశాల విద్య అక్షరాస్యత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. ఆడపిల్లలపట్ల వివక్ష చూపరాదన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. బాలికలను రక్షించడం, వారిని చదివించడం 'బేటీ బచావో.. బేటీ పడావో' ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళా శిశు అభివృద్ధిశాఖ ఉప సంచాలకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా జీవించే, చదువుకునే హక్కు ఆడపిల్లలకు ఉందన్నారు. ప్రతి ఆడపిల్ల చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తగ్గుతున్న ఆడపిల్లల లింగ నిష్పత్తిని మెరుగుపరిచేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాలికలపై హింస, లైంగిక వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైతే హెల్ప్‌లైన్ 1098కి ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. జిల్లా మహిళా శిశు అభివృద్ధిశాఖ జలాలప్ప, మహిళా శిశు అభివృద్ధి శాఖ వ్యాఖ్యాత రామకృష్ణనాయక్, జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగప్ప, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వైస్. ప్రిన్సిపాల్ భైరప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం భ్రూణహత్యలపై హులుగప్ప బృందం అవగాహన నాటకాన్ని ప్రదర్శించారు.

సైకిల్ జాతా

బేటీ బచావో-బేటీ పడావో పదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సైకిల్ జాతా నిర్వహించారు. జాతాను న్యాయాధికారి రాజేష్ హొసమనె జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్, గడిగి చెన్నప్పసర్కిల్ తిరిగి ప్రభుత్వ బాలికల పాఠశాలకు జాతా చేరుకుంది.

విద్య, వైద్య రంగాల బలోపేతానికి కృషి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండురావ్

నగరంలో మాతృత్వ సురక్ష అభియాన్‌కు ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దినేశ్ గుండురావ్

రాయచూరు జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖల మంత్రి దినేశ్ గుండురావ్ అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మాతృత్వం సురక్ష అభియాన్‌ను రాయచూరు జిల్లా నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని మాతా,శిశు సంక్షేమ ఆస్పత్రి ఆవరణలో మాతృత్వ సురక్ష అభియాన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి దినేశ్ గుండురావ్ అభియాన్‌లో భాగంగానే రాష్ట్రంలోని అన్ని తాలూకా ఆస్పత్రులను త్వరలోనే జిల్లా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అన్ని ఆస్పత్రుల్లోను వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులను నియమించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన బాలింత మరణాలకు సంబంధించి నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. బాలింత మరణాల సంఖ్య ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు తక్కువగానే ఉన్నా అది సమర్థనీయం కాదన్న మంత్రి, బాలింత మరణాలను జీరోగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇప్పటికే అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

బాలింత మరణాలపై వారంలోగా నిపుణుల నివేదిక

రాయచూరు జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 12 మంది బాలింతలు మృత్యువాత పడిన సంఘటనకు సంబంధించి ఇప్పటికే నిపుణులైన అధికారుల బృందం విచారణ జరిపిందని నివేదికను వారం రోజుల్లోగా ప్రభుత్వానికి అందజేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండురావ్ అన్నారు. మాతా సురక్ష అభియాన్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి విలేకరులతో కొద్దిసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బాలింత మరణాలకు సంబంధించి బళ్లారి జిల్లాలో ఇప్పటికే బాధ్యులను గుర్తించి వారిపై ప్రభుత్వం కేసులు నమోదు చేసిందన్నారు. రాష్ట్రంలోని మిగితా చోట్ల జరిగిన మరణాలకు సంబంధించి త్వరలోనే నివేదిక అందుతుందని దాని ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు. వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ కర్ణాటక ప్రాంతంలో రూ.900 కోట్లను కేటాయించిందన్నారు. ఇందులో రూ.450 కోట్లకు సంబంధించిన పనులు పురోగతిలో ఉండగా మిగితా పనుల కోసం త్వరలోనే టెండర్లు ఖరారు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. కాగా డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడాన్ని ఏ శక్తి అడ్డుకోలేదంటూ హెచ్ విశ్వనాథ చేసినవ్యాఖ్యలపై స్పందించేందుకు మంత్రి దినేశ్ గుండురావ్ నిరాకరించారు. బయటి వ్యక్తులు తమ పార్టీ అంతర్గత వ్యవహారాల గురించి ఏలా మాట్లాడుతారని ఆ మాటలకు తాము స్పందించాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.





మాతృత్వ సురక్ష అభియాన్ పోస్టర్‌లను విడుదల చేస్తున్న మంత్రి, అధికారులు, మాట్లాడుతున్న మంత్రి దినేశ్ గుండురావ్

ర్యాట్ ఫీవర్‌పై అప్రమత్తత అవసరం

● డాక్టర్ మరియంబి

బళ్లారి సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ర్యాట్ ఫీవర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మరియంబి సూచించారు. ఇళ్లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నగరంలోని గుగ్గరహట్టి ప్రాంతంలో అనుమానాస్పద కేసుల నేపథ్యంలో ప్రజలకు ఈ ర్యాట్‌ఫీవర్‌పై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మరియంబి మాట్లాడుతూ ర్యాట్ ఫీవర్‌ను లెప్టోస్పిరోసిస్ అని పిలుస్తారని, ఇది లెప్టోస్పైర్ అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ బ్యాక్టీరియా సోకిన ఎలుక మనిషిని కరిచినా లేదా మూత్రం, మలం మనిషి చర్మానికి తగిలినా ఇన్ఫెక్షన్ వస్తుందని వివరించారు. తలనొప్పి, వికారం, వాంతులు, కీళ్లనొప్పులు, చర్మంపై పొక్కులు వంటివి ఈ సాధారణ లక్షణాలుగా పేర్కొనవచ్చన్నారు. సకాలంలో చికిత్స తీసుకోవాలని, లేనిపక్షంలో కిడ్నీలపై ప్రభావం చూపుతుందన్నారు. ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతులు, కాళ్లు కడుక్కోవాలని, ఆహారాన్ని మూసివేసి ఉంచాలన్నారు. అవగాహనా కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కాశీప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ గుప్తా, తాలూకా అంటువ్యాధుల పాలనాధికారి నవీన్, సిబ్బంది మంజుళ,అరుణ,జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పూర్తిచేయండి

మేయర్‌కు వినతి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని వార్డు నెం. 15 బాలాజీరావు రోడ్డులో వంతెనను త్వరితగతిన పూర్తిచేయాలని సామాజిక కార్యకర్త మేకల ఈశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు మేయర్ ముల్లంగి నందీశ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. భారీ వాహనాలు వెళుతుంటాయని, జరగరానిది జరిగితే బాధపడాల్సి వస్తుందన్నారు. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే పనులు చేపట్టాలని కోరారు. రాత్రి సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉందన్నారు. ఆయన వెంట సామాజిక కార్యకర్త మేకల ఈశ్వరరెడ్డి, ఎస్ కృష్ణ, ఎం.భాష, పి.శ్రీనివాసరెడ్డి, ఉప్పర మల్లప్ప, శ్రీనివాసరెడ్డి, జగన్నాథ్, పి.నారాయణ, వెంకటేశ్, అభిషేక్ తదితరులు ఉన్నారు.

సింధనూరులో మరో బాలింత మృతి

రాయచూరు జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు నగరంలో మహెబూబియా కాలనీకి చెందిన బాలింత ఒకరు బుధవారం మృతిచెందింది. రెండు నెలల క్రితం మహెబూబియా కాలనీకి చెందిన అంబికా సంతోష్(30)కు సింధనూరు తాలూకా ఆస్పత్రిలో సహజ కాన్పు జరిగింది. రెండు నెలల పాటు ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న బాలింత గత ఆదివారం అనారోగ్యానికి గురి కావడంతో తాలూకా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్సనందించారు. మరుసటి రోజు ఇంటికి వెళ్లగా తిరిగి సాయంత్రం జ్వరం రావడంతో ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు రక్త ప్రసరణ తగ్గిపోతున్నట్లు తెలపడంతో బుధవారం తిరిగి ఆమెను తాలూకా ఆస్పత్రికి తీసుకెళ్లె ప్రయత్నం చేస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాతపడింది. బాలింత మృతికిగల కారణాలపై వైద్యులు ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హక్కులను సద్వినియోగం చేసుకోండి

జిల్లా అదనపు సెషన్స్ న్యాయాధికారి విద్యాధర్ శిరహట్టి

బళ్లారిసిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యానికి గురైన వారు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు సెషన్స్ న్యాయాధికారి విద్యాధర్ శిరహట్టి సూచించారు. బళ్లారి సెంట్రల్ జైలులో జిల్లా మానసిక ఆరోగ్య సమీక్ష మండలి తొలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతినెలా సమావేశాలను నిర్వహించి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. నిబంధనల మేరకు వసతులు, సలహాలు, సహాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సీనియర్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లా సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ లతా, తహసీల్దార్ గౌసియా బేగం, జిల్లామానసిక ఆరోగ్య కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ డాక్టర్ వీరేంద్రకుమార్, సైకియాట్రిస్ట్ డాక్టర్ రోహన్ వనగుండి, తస్మియా, వైద్యాధికారిణి డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

టీబీతో జాగ్రత్త: వైద్యాధికారి

సిరుగుప్ప, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలని టెక్కలకోట పట్టణ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి విద్యశ్రీ సూచించారు. బుధవారం తాలూకాలోని టెక్కలకోట ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఆహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యశ్రీ మాట్లాడుతూ టీబీ, క్షయ, కలరా అంటువ్యాధుల పరిధిలో వస్తాయన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. మాస్కులు ధరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు హరీష్, మహమ్మద్ ఆసిన్ పాల్గొన్నారు.

వీరశైవులు అన్ని రంగాల్లో ముందుండాలి

కొట్టూరు మహాస్వామి బసవలింగ మహాస్వామి

కంప్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత సమాజం అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని కొట్టూరు మహాస్వామి బసవలింగ మహాస్వామి అన్నారు. కంప్లి పట్టణంలో సంగాత్రేయ పాఠశాలలో వీరశైవ లింగాయత సమాజం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వీరశైవలింగాయత సమాజంలో వుండే వారు పద్ధతులు అనుసరించి భవిష్యత్తులో ముందుకు సాగాలన్నారు. వీరశైవలింగాయత ధర్మాలు ఎప్పటికీ మరువరాదని సూచించారు. అనంతరం అక్కమహాదేవి మహిళా సంఘాలు, లింగాయత్ సమాజ ప్రముఖులు చానాల్ శేఖర్ జన్మదినం సందర్భంగా ఆయనను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో అరివి బసవనగౌడ, వీరశైవలింగాయత్ జిల్లా మాజీ అధ్యక్షులు చానాల్ శేఖర్, హేమయ్యస్వామి, మూకయ్యస్వామి, బసవరాజు, గంగమ్మ, మల్లన్నగౌడ, బీవీ గౌడ, చంద్రశేఖర్ గౌడ, అమరేగౌడ, జగదీష్, బళే మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



మైత్రి సహకార సంఘంలో ఎన్నికైన వారికి అభినందిస్తున్న బసవలింగస్వామి

రైతులకు సహకరించండి



మంత్రి నిమ్మల రామానాయుడును కలిసిన అఖిల భారత తెలుగు అకాడమీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ

కంప్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం కింద పంటలు పండిస్తున్న రైతులకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్లు అఖిల భారత తెలుగు అకాడమీ అధ్యక్షులు గారపాటి రామకృష్ణ తెలిపారు. ఆయనను పాలకొల్లులో కలిశామన్నారు. ఈ సందర్భంగా తుంగభద్రజలాశయం కింద వున్న హెచ్చెల్సీ, ఎల్‌ఎల్‌సీ, బళ్లారి, రాయచూరు, కొప్పాళ, యాదగిరి, మాన్వి, సింధనూరు ప్రాంతాల్లోని రైతుల సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. మరికొన్ని రోజుల్లో రైతులతో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. కల్లూరి శ్రీనివాసరావు, కళ్యాణ శేషగిరి రావు, అకాడమీ పదాధికారులు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

మిశ్రమ పంటలతో అధిక లాభాలు

మహిళా రైతు షంషాద్ బేగం



అంజూర పంటను చూపుతున్న షంషాద్ బేగం

కంప్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి రైతులు ఒకే పంటకు పరిమితం కాకుండా మిశ్రమ పంటలతో అధిక ఆదాయం పొందవచ్చునని షనవాజ్‌పురం గ్రామానికి చెందిన మహిళ షంషాద్ బేగం సూచించారు. కురుగోడు తాలూకా సమీపంలోని షెనవాజ్‌పుర గ్రామానికి చెందిన ఈమె వ్యవసాయంలో రాణిస్తున్నారు. పది ఎకరాల్లో రెండు బోర్లు వేయించి డ్రిప్ పద్ధతిలో పంటలు వేసి లాభాలు అర్జిస్తున్నారు. బుధవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఎనిమిది ఎకరాల్లో అంజూర వేయడం జరిగిందన్నారు. మిగతా రెండు ఎకరాల్లో బీన్స్, మునగ, సీతాఫల, అరటి, శ్రీగంధ, డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నానన్నారు. అన్ని పంటలతోపాటు ఈ యేడాది అంజూర మంచి దిగుబడి వచ్చిందన్నారు. అంజూర తోటలో మిశ్రమ పంటలనున సాగుచేయడం వల్ల అధిక దిగుబడులు సాధ్యమయ్యాయన్నారు. ఖాళీగా వున్న భూమిలో ఇలాంటి పంటలు వేస్తే లాభాలు సాధ్యమన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని సాగుచేయడం జరిగిందన్నారు.

గుండెపోటుతో ఆర్ఐ మృతి

సిరుగుప్ప, జనవరి 22(ఆంధ్రజ్యోతి): టెక్కలకోట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ (52) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సిరుగుప్ప తాలూకా టెక్కలకోట పట్టణంలో ఆర్ఐగా సేవలు అందించేవారు. కాగా బుధవారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో మృతి చెందారు. జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, తహసీల్దార్ విశ్వనాథ్, డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, సిరుగుప్ప రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మంజునాథ తదితరులు సంతాపాన్ని తెలిపారు.

హొసూరు జోన్

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

హొసూరు(క్రైం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): హొసూరు ప్రాంతంలో కొరియర్ ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్‌కు అందిన రహస్య సమాచారంతో అవుటర్ రింగ్ రోడ్డు హొసూరు కార్పొరేషన్‌లో రెండు రోజులుగా గస్తీ నిర్వహించారు. ఇలా గంజాయి కొరియర్‌తో వచ్చిన ఇద్దరు వ్యక్తులు 2 కిలోల గంజాయితో రెడ్‌హ్యాండ్‌గా పట్టుపడ్డారు, వారిని విచారించగా వారు కేరళ రాష్ట్రం కొట్టాయం ప్రాంతానికి చెందిన అభిలాష్(21), విష్ణుసత్య(23)గా గుర్తించారు. బేలగొండపల్లిలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని స్మగ్లింగ్ చేసి తన గదిలో భద్రపరిచిన హొసూరు, డెంకణీకోట ప్రాంతంలోని చిల్లర వ్యాపారులకు విక్రయించి కిలోల లెక్కన కేరళకు కొరియర్ ద్వారా పంపేందుకు సిద్ధమయ్యారు. వారు బస చేసిన గదిలో సోదా చెయ్యగా మొత్తం 32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నేరగాళ్లను హొసూరు ఎన్‌డీపీఎస్ విభాగం ఇంటెలిజెన్స్ విభాగం పోలీసులకు అప్పగించారు.

డ్రైవర్ హత్య కేసులో అదుపులో ఒకరు

హొసూరు(క్రైం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): హొసూరు ప్రాంతం తేరుపేట తెప్పకులం వద్ద శివకుమార్ (32) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి శివకుమార్ ఇంటి ముందు ఫోన్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి దాడి చేశారు. ద్విచక్ర వాహనదారుడిని కత్తితో బెదిరించి బైక్ లాక్కుని పారిపోయినట్లు సమాచారం అందింది. రక్తపుమడుగులో కుప్పకూలిపోయిన శివకుమార్‌ను హొసూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పాత పగలా లేదా మరేదైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా అనుమానం వచ్చిన నగర పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వ్యవసాయ భూమి సేకరణ వద్దు: రైతులు



వినతిపత్రం ఇస్తున్న రైతులు

హొసూరు జనవరి 22(ఆంధ్రజ్యోతి): హొసూరు విమానాశ్రయం కోసం రైతుల నుంచి వ్యవసాయ భూమిని సేకరించవద్దని హొసూరు డెంకణీకోట తాలూకా రైతులు హొసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్‌ను కోరారు. ప్రతిపాదిత విమానాశ్రయం ప్రాజెక్టుకు బేలగొండపల్లి, కలకొండపల్లి, గోపనపల్లి, ముదుగానపల్లి, హొసపురం, డెంకణీకోటలో చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 2వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించడానికి సిద్ధమయ్యారు. సాగుభూములను విమానాశ్రయ ప్రాజెక్టుకు తీసుకోవద్దని తద్వారా నష్టపోతామని రైతు సంఘం తరఫున ఎమ్మెల్యే వై.ప్రకాశ్‌కు వినతిపత్రం అందచేశారు. విమానాశ్రయం కోసం ప్రస్తుతం అవుట్‌సోర్సింగ్ సర్వే ఏజెన్సీ గూగుల్ ఎర్త్ మ్యాప్‌ల ఆధారంగా భూమి సర్వే చేపట్టింది. తమ అంగీకారం లేకుండా డ్రోన్ సర్వేలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వడ్రపాళ్యం, ముదుగానపల్లి పంచాయతీ, బొమ్మసంద్రం, గోపనపల్లి పంచాయతీ, గూళిసంద్రం తదితర గ్రామాలలో ముఖ్యంగా మారియమ్మ, మధురమ్మ, దేవీశ్రీ పట్టాలమ్మ, మల్లికార్జున స్వామితో పాటు అనేక ఇతర ఆలయాలు ఉన్నాయని వినతిలో పేర్కొన్నారు.